క్లుప్తంగా

పర్ణశాల గోదారి తీరం పరిశీలన

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల లో గోదావరి నదీ తీరాన్ని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. బుధవారం దుమ్ముగూడెం సీఐ దోమల రమేష్‌తో కలిసి పరిశీలించారు. పర్ణశాల గోదావరిలో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అనుమతి లేదని, ఈ విషయాన్ని గమనించి నిమజ్జనోత్సవాలను వచ్చే ఉత్సవ కమిటీలు భద్రాచలం లోని గోదావరి నదిలోనే నిమజ్జనాలు నిర్వహించాలని ఈ సందర్భంగా వారు స్థానికులకు సూచించారు. సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు పనులను పరిశీలించి స్థానికుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విగ్రహాలను భద్రాచలానికి మాత్రమే తరలించాలని ఆయన సూచించారు. వీరి వెంట ఎస్సై గణేష్ ఉన్నారు.

చేప పిల్లల పంపిణీ

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై మత్స్యకారులకు ఉచితంగా అందిస్తున్న చేప పిల్లలను ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి స్థానిక ఎంపీడీవో కార్యాలయం లో బుధవారం సొసైటీల బాధ్యులకు, సర్పంచ్‌లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 50 చెరువులకు కలిపి 6,21,000 వేల చేప పిల్లలను జిల్లా మత్స్యకార శాఖ ఆధ్వర్యంలో అందించారని, వీటిలో పలు రకాల చేప పిల్లలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి బానోతు వీరన్న, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సీతారామరాజు, మండల మత్స్యశాఖ ఇన్‌చార్జ్ మంగరాజు, బీఆర్ఎస్ నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అశ్వారావుపేటరూరల్: మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలోని చర్చి ఆవరణలో జరిగిన ఆ సంఘం సమావేశంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వెలుగు జాకబ్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా జి.సజీవరాజు, కార్యదర్శిగా ఎస్.రమేష్, జాయింట్ కార్యదర్శిగా జాషువా, కోశాధికారిగా శ్యాంసుందర్, రాజేష్, గౌరవ సలహాదారులుగా వెంకటరత్నం, రాజా జాన్సన్, మోజెష్, మన్నా విజయ్ కుమార్, ప్రకాష్, స్టీవెన్ దొర, సియోను కుమార్, నిరీక్షణరావు, సుధాకర్, జాన్, వరప్రసాద్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వెలుగు జాకబ్‌ను తోటి పాస్టర్లంతా కలిసి శాలువాతో సన్మానించారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ములకలపల్లి: రైతాంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణా రైతుసంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర నాయకుడు ముద్దా భిక్షం పిలుపునిచ్చారు. ములకలపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) మండల సదస్సులో పాల్గొన్న వారు మాట్లాడారు. నూపా భాస్కర్, ముదిగొండ రాంబాబు, ఎండి.యూసఫ్, కల్లూరి కిషోర్, ఛాత్రబోయిన వెంకటేశ్వర్లు, నరాటి రమేశ్, మాలోతు రావూజా, లక్ష్మీనర్సు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీషర్టుల పంపిణీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీలో వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా గణేష్ యూత్ కమిటీ సభ్యులకు మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు చేతుల మీదుగా బుధవారం టీషర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొమరం జంపేశ్వరి, ఏనిక ప్రసాద్, వార్డ్ మెంబర్ తాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ కొమరం పాపారావు, మాజీ ఉపసర్పంచ్ కంపా రవి, రైతు బంధు నాయకులు వెంకటరెడ్డి, పర్సా లచ్చు, తాతా రమణ, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్‌కు టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.20కోట్ల నిధులు మంజూరు కావడంపై మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ పోశం నరసింహారావు మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు ముత్యం బాబు, అడపా అప్పారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి నవీన్, ఉపాధ్యక్షుడు షేక్ బాబ్ జానీ, రైతు సమన్వయసమితి అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీ పగిడేరు, ఇప్పల గుంపులకు చెందిన సుమారు 165 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మణుగూరు వైస్ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, సర్పంచ్ తాటి సావిత్రి, ఉపసర్పంచ్‌లు పుచ్చకాయల శంకర్, కనకయ్య, వెంకట్రావుగౌడ్, తరుణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తాటి బిక్షం, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

త్రీ ఫేజ్‌కు 'లైన్' క్లియర్

- అటవీశాఖ అనుమతులతో తొలగిన అడ్డంకులు
- తీరనున్న గిరిజనుల చిరకాల కోరిక

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన వెంకటాపురం గ్రామ పంచాయతీలోని మామిళ్లవాయి గిరిజన గ్రామానికి త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల నెరవేరనుంది. గిరిజన గ్రామానికి త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం ఎన్నో ఏళ్ల క్రితమే మంజూరు అయింది. కానీ మామిళ్లవాయి గ్రామం అటవీ, వైల్డ్ లైఫ్ ప్రాంతంలో ఉండటంతో త్రీ ఫేజ్ విద్యుత్ లైన్‌కు అనుమతులు రాలేదు. అటవీ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపగా ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. అనుమతులు మంజూరు చేయాలని అటవీ, వైల్డ్ లైఫ్ అధికారులను స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజనులు ఎన్నో ఏళ్లుగా విన్నవిస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేసింది. వెంకటాపురం నుంచి మామిళ్లవాయి వరకు 6 కిలోమీటర్ల పొడవుకు త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటుకు అడ్డంకులు తొలగాయి. ఈ నేపథ్యంలో త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ కన్‌స్ట్రక్షన్ ఏఈ ఉమారావు, సబ్ ఇంజనీరు మణిదీప్, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మామిళ్లవాయి గ్రామాన్ని సందర్శించారు. వెంకటాపురం నుంచి మామిళ్లవాయి వరకు త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. అంచనాలు పూర్తి అయ్యాక విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు ప్రారంభించనున్నారు. ఈ మేరకు సబ్ ఇంజనీరు మణిదీప్ వివరాలు



మామిళ్లవాయిలో త్రీ ఫేజ్ లైన్ ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

తెలిపారు. నెరవేరనుండటంతో ఎన్నో ఏళ్ల చిరకాల కోరిక అయిన త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల నెరవేరుతుండటంతో మామిళ్లవాయి గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే..



త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటుకు అటవీ అనుమతులు మంజూరు చేయాలని అటవీ శాఖ అధికారులను ఎన్నో ఏళ్లుగా కోరుతున్నాం. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటుకు అటవీ అనుమతులు వచ్చాయి. గ్రామస్తుల పక్షాన ఎమ్మెల్యే రేగాకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– మడకం సాధు, సర్పంచ్, వెంకటాపురం

గ్రామస్తుల కల నెరవేరనుంది..



త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ మా గ్రామస్తుల కల. ఎన్నో ఏళ్లుగా విన్నవిస్తున్నాం. త్రీ ఫేజ్ విద్యుత్ లేక గిరిజన రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెల్యే రేగా కాంతారావు కృషితో త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు మంజూరు అయ్యాయి. గ్రామస్తుల చిరకాల కోరిక నెరవేరనుంది.

– బొర్రా శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ

బై బై గణేషా..!

గణపతి నవరాత్రోత్సవాల్లో ముగియడంతో గణనాథుల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వీధుల్లో బాణాసంచా పేలుస్తూ.. పాటలతో యువకులు, పెద్దలు నృత్యాలు చేశారు. మహిళలు కోలాటాలు వేశారు. భక్తులకు అన్నప్రసాదాలను అందిస్తూ గణనాథులను ఊరేగించారు. నీటి వనరులకు చేరుకుని నిమజ్జనాలు చేశారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణతోపాటు నిమజ్జన ప్రాంతాల్లో తగు చర్యలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: గణేష్ శోభాయాత్ర నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు



అన్నపురెడ్డిపల్లి: నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



గుండాల: సుభాష్ నగర్‌లో లడ్డూతో భక్తులు



అన్నపురెడ్డిపల్లి: డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా వస్తున్న వినాయకుడు



మణుగూరుటౌన్: కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఊరేగింపు..

ఎమ్మెల్యే మెచ్చా పర్యటన



దమ్మపేట: అన్నదానం కార్యక్రమంలో భాగంగా బాలుడికి వడ్డిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

దమ్మపేట: మండలంలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం మండలంలోని మందలపల్లి, దమ్మపేట గ్రామాల్లో పర్యటించి.. పలు గణేష్ మండపాలను సందర్శించారు. గణేషుడికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని కాసేపు వడ్డన చేశారు. అనంతరం పెద్దగొల్లగూడెం, నాగుపల్లి గ్రామాల్లో ఇటీవలే మృతి చెందిన వారి చిత్రపటాలకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, అబ్దుల్ జిన్నా, చిన్నశెట్టి సత్యనారాయణ, యార్లగడ్డ బాబు, పగడాల రాంబాబు,రావుల శ్రీను, జలగం వాసు, పాలడుగుల అబ్బులు, సర్పంచ్‌లు పాశం సుగుణ, మడివి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు..

అశ్వారావుపేటరూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు స్వామి వారిని దర్శించుకున్నారు. మహా అన్నసమారాధన కార్యక్రమానికి హాజరై, ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు మండపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, సంపూర్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు



మణుగూరుటౌన్: మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దుమ్ముగూడెం: మండలంలోని చింతగుప్ప పంచాయతీ పరిధిలోని ఆవాస ప్రాంతమైన జీపీఎస్ తోగూడెం పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే హెల్త్ క్యాంప్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు శిరీష, శ్యాంప్రసాద్‌లు పిల్లలని పరీక్షించి మందులను అందజేశారు. పిల్లల్లో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేవని ఇబ్బందులు ఏమైనా అనిపిస్తే సమాచారం అందించాలని అన్నారు. ఏఎన్ఎం భారతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పనపల్లిలో..

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. జలుబు, దగ్గు, వళ్ళు నొప్పులతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కనకం తనుజ, హెచ్ఎస్ యండి.ఇమాం, సిబ్బంది టి.శ్రీదేవి, జి.శాంతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగుల ఇళ్లను సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగుల కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రూప, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రదీప్, ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్ఎం లలితకుమారి, నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.


మున్సిపల్ సిబ్బందికి..

మణుగూరుటౌన్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ పరిశుభ్రతకు పూర్తిస్థాయిలో అందుతుందని, క్లీన్ అండ్ గ్రీన్ మణుగూరుకు తోడ్పడుతారని అన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు మాధవి, సరిత, ప్రవీన్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమ్మెలు

17 రోజులుగా ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమ్మె, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాల సమ్మెలు బుధవారం కొనసాగాయి. సమ్మెలో నినాదాలు చేస్తూ.. పలు రీతుల్లో నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సమస్యలను తక్షణమే పరిష్కరించాలి డిమాండ్ చేశారు. పలు పార్టీల నాయకులు సమ్మె శిబిరాలను సందర్శించి తమ మద్దతు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంఅర్బన్: రోడ్డుపై వంట చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



ములకలపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు



బూర్గంపాడు: మానవహారం చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు

జిల్లా జట్టుకు ఎంపిక

చర్ల: భద్రాచలంలో జరిగిన అండర్ 14 వాలీబాల్ పోటీల్లో చర్లలోని గురుదేవ్ విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా కట్టుకు ఎంపికయ్యారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు యు.ప్రతిభ, పి.లక్ష్మీరాఘవలు బాలిక, బాలుర విభాగాల్లో పాల్గొని జిల్లా స్థాయిలో ఆడేందుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం గురుదేవ్ విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఎంఈఓ జుంకీలాల్, ప్రిన్సిపాల్ హెజ్‌జీవీ గిరిప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, పీఈటీలు సుధాకర్, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు మెగా హెల్త్ క్యాంప్

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడు ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో శుక్రవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడిస్తూ.. సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఈ వైద్యశిబిరంలో రోగులకు సేవలను అందిస్తారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డుల కోసం వచ్చే వారు తమ ఆధార్, రేషన్‌కార్డులను తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

చర్ల: సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ ధర్మారం క్యాంపు ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆలయంలో క్యాంపు అసిస్టెంట్ కమాండెంట్ అశ్వనీవర్మ నేతృత్వంలో భగవాన్ శ్రీ రాధాకృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపులోని జవాన్లతో పాటు పామేడు, ధర్మారం, యాంపురం, జరుపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు, ఆయా గ్రామాల్లోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

మణుగూరుటౌన్: మణుగూరు 100 పడకల ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలను వెంటనే చెల్లించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయా కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తుమ్మలను కలసిన నాయకులు

దమ్మపేట: ఇటీవలే తుమ్మల కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా, మండలంలోని గండుగులపల్లిలోని నివాసంలో కాంగ్రెస్ పార్టీకు చెందిన నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ, సున్నం నాగమణి, పొంగులేటి అనుచరులు, తదితరులు తుమ్మలను మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సత్కరించారు.

తుమ్మల వర్గీయుల రాజీనామా

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రధాన అనుచరులు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. ఇటీవలే తుమ్మల కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా, మండలంలోని గండుగులపల్లి గ్రామంలో ఆయన ప్రధాన అనుచరులుగా పేరొందిన వ్యక్తులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశామని ప్రకటించారు. భవిష్యత్తులో తుమ్మల వెంటే పయనిస్తామని తెలిపారు. రాజీనామా ప్రకటించిన వారిలో అలపాటి రామచంద్రప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, కెవి. సత్యనారాయణ, మన్నెం అప్పారావు, వసంతరావు, పోతినేని వెంకట్రావు, దొడ్డా సత్యం తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

అశ్వారావుపేటరూరల్: నీట్‌లో సీటు సాధించిన గిరిజన విద్యార్థినికి అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన సున్నం ఐశ్వర్య శ్రీనగర్‌లో ఎంబీబీఎస్ సీటు దక్కించుకోగా.. చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల 1990–91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా కలిసి రూ.30వేలను సేకరించారు. ఈ నగదును స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసరావుల చేతుల మీదుగా విద్యార్థిని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భద్రాచలం బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, కట్టా సుబ్బారావు, మానేపల్లి విజయబాబు, జల్లిపల్లి రవి, దేవరాజ్, మాసాబత్తుల రాము, బిర్రం పద్మావతి, వేముల శ్రీనివాసరావు, టి.వెంకట్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీ ఎస్టీకాలనీలో ఇటీవలే అనారోగ్యంతో మరణించిన వల్లెపోగు నగేష్ దశదినకర్మలకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సతీమణి రేగా సుధారాణి హాజరై మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.5వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బుద్దరాజు నవీన్‌బాబు, మహిళా నాయకురాలు తాళ్లపల్లి రజిత, రాణి, నాయకులు సిద్దెల తిరుమలరావు, కట్ట రాజ్‌కుమార్, మహేష్, గుంటక ప్రవీణ్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

అశ్వాపురం: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మొండికుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొండికుంటలో రూ.కోటితో ప్రధాన రహదారికి ఇరువైపులా నిర్మిస్తున్న డ్రెయినేజీ, రూ.6 కోట్లతో నిర్మిస్తున్న మొండికుంట–తుమ్మలచెరువు రహదారి పనులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి సర్పంచ్ మల్లారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు రూ.80 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, నవోదయ స్కూల్ వరకు బీటీ రోడ్డు వంటి అభివృద్ధి పనులు సాగుతున్నాయని, బీజీ కొత్తూరులో నవోదయ పాలిటెక్నిక్ కళాశాలకు అనుమతులు వచ్చాయని తెలిపారు. త్వరలోనే గ్రామంలో సెంట్రల్ లైటింగ్, తుమ్మలచెరువు పర్యాటక కేంద్రంగా పనులు పూర్తవుతావుతాయని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, పీఏసీఎస్ డైరెక్టర్ కాసరబాద సందీప్, బీఆర్ఎస్ నాయకులు పాటి మన్మథరెడ్డి, పంపన సత్యనారాయణ, రేసు భిక్షంరెడ్డి, పగడాల వెంకటరెడ్డి, వెంగల భిక్షంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాలను బుధవారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాల్లో ఆయన చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తొలిదశ తెలంగాణ ఉద్యమం, రాష్ట్రం ఆవిర్భావంలో ఆయన పోషించిన పాత్రను నెమరువేసుకున్నారు. కార్యక్రమాల్లో అధికారులు, ఎన్ఎస్ఎస్ బాధ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంఅర్బన్: బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మెజిస్ట్రేట్ శివాజీ



అన్నపురెడ్డిపల్లి: నివాళులర్పిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, సిబ్బంది



దుమ్ముగూడెం: కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



అశ్వారావుపేటరూరల్: ఎంపీపీ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో..



చంద్రుగొండ: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రేవతి తదితరులు